జాతీయ దిన పత్రిక

# తొలి వెలుగు

మన భాష.. మన పత్రిక..






నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 03 | పేజీలు : 8 | ఆదివారం 11 జనవరి 2026 | వెల : 2/-


## మున్సిపల్ ఎన్నికల వేళ ఊహించని నిర్ణయం - కీలక మలుపు..!!



డెస్క్, జనవరి 10 (తొలి వెలుగు) : తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పంచాయితీ ఎన్నికలు పూర్తి కావటంతో ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల దిశగా కసరత్తు జరుగుతోంది. సీఎం రేవంత్ జిల్లాల పర్యటనలు ఖరారయ్యాయి. అధికార కాంగ్రెస్ మున్సిపల్ పోరు వ్యూహం సిద్దం చేసింది. అటు బీఆర్ఎస్, బీజేపీ సైతం ఈ ఎన్నికలకు సై అంటున్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల సంఘం షెడ్యూల్.. ఎన్నికల తేదీల పై ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికలు ప్రధాన పార్టీలకు సెమీ ఫైనల్స్ గా మారుతున్నాయి. తెలంగాణలో సిసలైన రాజకీయ సమరం మొదలైంది. ప్రధాన పార్టీల పై పబ్లిక్ పల్స్ ఏంటో స్పష్టత వచ్చేందుకు సమయం ఆసన్నమైంది. మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్దమైంది. ఈ మేరకు ఎన్నికల సంఘం తుది కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలోని ఆరు మున్సిపల్ కార్పొరేషన్లు, 117 మున్సిపాలిటీలకు ఈ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నెల 17న ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే .....

మిగతా 2 లో..

## రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం




- "స్పిరిట్ ఆఫ్ డైలాగు అనే థీమ్‌తో వరల్డ్ ఎకనామిక్ ఫోరం - 2026 సమ్మిట్
- పెట్టుబడులను సాధించడమే ధ్యేయంగా దావోస్‌లో క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళికల పరిచయం
- ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం
- సీఎం రేవంత్ రెడ్డి

డెస్క్, జనవరి 10 (తొలి వెలుగు) : రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పెట్టుబడులను సాధించడమే ధ్యేయంగా దావోస్‌లో జరగనున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం (ప్రపంచ ఆర్థిక సదస్సు)--2026 సదస్సులో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను, దానికి అనుగుణంగా రూపొందించిన క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళికలను ప్రపంచానికి పరిచయం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్దేశించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ముందుకు సాగుతోందని పునరుద్ఘాటించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గడిచిన రెండేళ్లలో దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా రాష్ట్రానికి లభించిన పెట్టుబడి హామీలు, ప్రతిపాదనల పురోగతితో పాటు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్--2025లో ఆకర్షించిన పెట్టుబడులు ఇప్పటివరకు ఏ స్థాయిలో అమలయ్యాయనే అంశాలను ముఖ్యమంత్రి గారు సమీక్షించారు. పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణకు ఇప్పటికే ఉన్న బలాలు, సామర్థ్యాలను మరింతగా వినియోగించుకొని, మూడంచెల ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేలా రూపొందించిన క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళికలను తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్ వేదికగా ప్రపంచానికి వివరిస్తుందని ఆయన పేర్కొన్నారు. "స్పిరిట్ ఆఫ్ డైలాగు అనే థీమ్‌తో వరల్డ్ ఎకనామిక్ ఫోరం-2026 సమ్మిట్ జనవరి ...

2

## ఇకపై ఏటా ఉద్యోగాల జాతర..

### - జాబ్ క్యాలెండర్‌పై శ్రీధర్ బాబు ప్రకటన

- తెలంగాణలో త్వరలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు హామీ
- ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్న మంత్రి
- గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా టీజీపీఎస్సీని ప్రక్షళన చేశామని వెల్లడి



డెస్క్, జనవరి 10 (తొలి వెలుగు) తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కీలక హామీ ఇచ్చారు. త్వ-రలోనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని, దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఐఐటీ హైదరాబాద్‌లో నిన్నఅబశ్రీశ్రీ జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నియామక ప్రక్రియను వేగవంతం చేసిందని శ్రీధర్ బాబు తెలిపారు. ఇప్పటివరకు గ్రూప్స్‌తో సహా వివిధ నోటిఫికేషన్ల ద్వారా సుమారు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు గుర్తుచేశారు. ఎన్నికల హామీలో భాగంగా ప్రకటించిన 2 లక్షల ఉద్యోగాల భర్తీ లక్ష్యన్ని చేరుకోవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ నియామక ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంలో జాప్యం జరుగుతోందంటూ విపక్షలు చేస్తున్న విమర్శలపై మంత్రి స్పందించారు. గత పదేళ్ల పాలనలో నిరుద్యోగుల సమస్యలను విస్మరించిన వారే ఇప్పుడు తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో జరిగిన పేపర్ లీకేజీలు, న్యాయపరమైన చిక్కులు వంటివి పునరావృతం కాకుండా ఉ ఒడేందుకే టీజీపీఎస్సీని పూర్తిస్థాయిలో ప్రక్షళన చేశామన్నారు. దీనివల్ల నియామక ప్రక్రియలో కొంత జాప్యం జరిగినట్లు కనిపించినా, అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరగకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రాబోయే రోజుల్లో ప్రతి ఏటా ఏ నెలలో ఏ నోటిఫికేషన్ వస్తుంది, పరీక్షలు, ఫలితాల తేదీలతో కూడిన సమగ్ర జాబ్ క్యాలెండర్‌ను త్వరలోనే ప్రకటిస్తామని మంత్రి తెలిపారు. సోషఅబశ్రీశ్రీల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, కేవలం ప్రభుత్వ అధికారిక ప్రకటనలనే విశ్వసించాలని యువతకు ఆయన సూచించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే, ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను గుర్తించి భర్తీ చేసే ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని శ్రీధర్ బాబు స్పఅబశ్రీశ్రీష్టం చేశారు.

## విషపూరితంగా మారిన కిడ్స్ సిరప్..

## వాడొద్దంటూ తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ వార్నింగ్

- అమ్మకాలపై నిషేధం విధించిన అధికారులు
- రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్ ఇన్ స్పెక్టర్లకు సూచనలు
- కల్తీ జరిగిన సిరప్ బ్యాచ్, తయారీ వివరాల వెల్లడి



డెస్క్, జనవరి 10 (తొలి వెలుగు) : పిల్లలకు వాడే సిరప్ కలుషితమై విషపూరితంగా మారిందని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు తాజాగా హెచ్చరికలు జారీ చేశారు. ఆల్మంట్ కిడ్ సిరప్ వాడొద్దని రాష్ట్రంలోని తల్లిదండ్రులకు సూచించారు. కలుషితమైన సిరప్ బ్యాచ్ వివరాలను వెల్లడిస్తూ.. ఆ సిరప్ బాటిల్ ఉంటే వెంటనే సమీపంలోని డ్రగ్స్ కంట్రోల్ అథరిటీకి తెలియజేయాలని కోరారు. ఈ మేరకు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ కోల్‌కతా నుంచి సమాచారం అందిందని పేర్కొన్నారు.

అత్యంత విషపూరితమైన ఇథిలీన్ గ్లైకాల్ ఈ ఆల్మంట్ కిడ్ సిరప్ లో కలిసిందని డ్రగ్స్ కంట్రోల్ అధికారులు గుర్తించి ఈ మేరకు తెలంగాణ అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో ఆల్మంట్ కిడ్ సిరప్ అమ్మకాలను నిషేధిస్తూ, ఇప్పటికే కొనుగోలు చేసిన తల్లిదండ్రులకు తెలంగాణ అధికారులు హెచ్చరికలు చేశారు. ఇందుకోసం టోల్-ఫ్రీ నంబర్ 1800-599-6969 ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ సంచాలకులందరికీ, ఈ ఉత్పత్తి బ్యాచ్‌కు సంబంధించిన అందుబాటులో ఉన్న స్టాక్‌లను వెంటనే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇథిలీన్ గ్లైకాల్ విషపూరిత ప్రభావాల వల్ల కలిగే అనారోగ్యాలకు సంబంధించిన మందులను సిద్ధంగా ఉ ంచుకోవాలని ఆసుపత్రులకు సూచనలు చేశారు.

**కల్తీ అయిన సిరప్ వివరాలు..**

అల్మాంట్-కిడ్ సిరప్ (లెవోసెటిరిజైన్ డైహైడ్రోక్లోరైడ్, మోంటెలుకాస్ట్ సోడియం సిరప్)
బ్యాచ్ నెం. ౹ూూ-24002
తయారీ తేదీ జనవరి-2025
గడువు తేదీ డిసెంబర్-2026

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పోటీ..?

- పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా పోటీ చేయాలని నిర్ణయం
- నెల రోజుల కంటే తక్కువ సమయం ఉన్నప్పటికీ ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తామని వెల్లడి
- పార్టీని, పవన్ కల్యాణ్ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడమే లక్ష్యమన్న జనసేన

▸ 2



## నిజామాబాద్ ఎమ్మెల్సీ బరిలో మంత్రి అజారుద్దీన్?



డెస్క్, జనవరి 10 (తొలి వెలుగు) : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాజీనామాతో ఖాళీ అయిన నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానంలో మంత్రి అజారుద్దీన్‌ను బరిలోకి దింపాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ప్రస్తుతం మంత్రిగా కొనసాగుతున్న అజారు-ద్దీన్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించాలన్న సిఫార్సు పెండింగ్‌లో ఉండటంతో అధికార పార్టీ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెల్లోపు అంటే ఏప్రిల్ 31 నాటికి ఆయన శాసనసభ లేదా మండలి సభ్యుడిగా ఎన్నికవ్వాల్సి ఉండటమే ఇందుకు ప్రధాన కారణం.

# రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి..

19 నుంచి 23 వరకు దావోస్‌లో జరగనుంది. గతంలో పెట్టుబడిదారులతో చేసుకున్న ఒప్పందాలను పునఃసమీక్షించి, వాటి అమలుపై ఫాలోఅప్ చేయాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ఇన్వెస్ట్మెంట్ గ్రౌండింగ్‌లో ఏవైనా సమస్యలు లేదా అడ్డంకులు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచిన ఆర్థిక వృద్ధి ప్రణాళికలు, ప్రతిపాదనలను ప్రపంచ దేశాల పెట్టుబడిదారులకు సమర్థవంతంగా చేరవేసేందుకు తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్‌లో విస్తృత స్థాయి సమావేశాలు, చర్చలు నిర్వహించనుంది.




# మున్సిపల్ ఎన్నికల వేళ ఊహించని నిర్ణయం - కీలక మలుపు..!!

మొదటిపేజీ తరువాయి..

అవకాశం ఉందని సమాచారం. అదే విధంగా ఇదే నెల 21 లేదా 22 తేదీల్లో నోటిఫికేషన్ విడుదల చేసి.. ఫిబ్రవరి 20వ తేదీ లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. ఈసారి బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎస్ఈసీ ఎన్నికలకు వెళ్తున్నది. దీంతో, ఇప్పుడు ఈ ఎన్నికలు ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారుతోంది. పంచాయితీ ఎన్నికల ఫలితాల తరువాత కాంగ్రెస్ - బీఆర్ఎస్ లో మున్సిపల్ పోరులో విజయం పైన ధీమా పెరిగింది. దీంతో, వీలైనంత త్వరగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని అధికార కాంగ్రెస్ భావిస్తోంది. విద్యార్థుల పరీక్షల సీజన్ ప్రారంభానికి ముందే ప్రక్రియను ముగించాలని చూస్తున్నారు. అయితే, ఓటరు జాబితాలు తప్పుల తడకగా ఉన్నట్టు ఇప్పటికే అనేక జిల్లాల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఒక్కో కుటుంబం ఓట్లు వేర్వేరు చోట్ల ఉన్నట్టుగా ఆరోపణ లు వచ్చా యి. ఈ నేపథ్యంలో ఈ నెల 10న పూర్తి కావాల్సిన తుది ఓటరు జాబితా ప్రకటన.. 12న ప్రచురించేలా అవకాశం కల్పించాలని ఇటీవల ఎస్ఈసీతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల ఎన్నికల అధికారులు కోరినట్టు తెలిసింది. రాష్ట్రంలోని 32 జిల్లాల పరిధిలోని 6 మున్సిపల్ కార్పొరేషన్లలోని 366 వార్డులు, 117 మున్సిపాలిటీల పరిధిలోని 2,630 వార్డులకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను ఈ నెల 12న ప్రచురించాలని కమిషనర్ ఆదేశించారు. దీంతో, రాష్ట్రంలో ఈ నెల 17న మున్సిపల్ షెడ్యూల్ విడుదల అయితే, ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది.

# చిన్నపిల్లల అపహరణలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

## - కాజీపేట పోలీసుల మెరుపు ఆపరేషన్

వరంగల్ / కాజీపేట, జనవరి 10 (తొలి వెలుగు) : వరంగల్ నగర పరిధిలో చిన్నపిల్లలను కిడ్నాప్ చేస్తూ, వారికి అక్రమంగా విక్రయాలు చేస్తున్న ముఠాను కాజీపేట పోలీసులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఐదుగురు చిన్నారులను సురక్షితంగా రెస్క్యూ చేయడం జరిగింది.

గత నెల డిసెంబర్ 28, 2025 తెల్లవారుజామున కాజీపేట రైల్వే స్టేషన్ బయట ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న కన్నా నాయక్ కుమారుడైన ఐదు నెలల మల్లన్న అనే శిశువును గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. ఈ ఘటనపై బాలుడి తండ్రి కన్నా నాయక్ ఫిర్యాదు మేరకు కాజీపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కాజీపేట పోలీసులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఈ రోజు ఉదయం కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో మళ్లీ చిన్నపిల్లల కిడ్నాప్‌కు రెక్కీ నిర్వహిస్తున్న ఇద్దరు నిందితులను పట్టుకున్నారు.

అరెస్టైన నిందితులు

1. కొడుపాక నరేష్ (42), పెద్దపల్లి జిల్లా ఘువాపూర్ గ్రామానికి చెందినవాడు
2. వెల్పుల యాదగిరి (32), పెద్దపల్లి టౌన్ శాంతినగర్‌కు చెందినవాడు



అద్దెకు తీసుకున్న టూ03జ్ఞ6718 నెంబర్ గల స్విఫ్ట్ డిజైర్ కారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని విచారించగా, ఐదు నెలల మల్లన్న కిడ్నాప్‌తో పాటు గతంలో నలుగురు చిన్నారులను కూడా కిడ్నాప్ చేసినట్లు ఒప్పుకున్నారు. పిల్లలు లేని దంపతులను మోసం చేస్తూ, అనాధాశ్రమాల నుంచి తీసుకొచ్చిన పిల్లలని నమ్మబలికి డబ్బులకు విక్రయించినట్లు పోలీసులు తెలిపారు.

వీరి ఒప్పుకోలు మేరకు

- జన్నారం మండలం లింగయ్యపల్లి గ్రామంలో ఐదు నెలల మల్లన్న
- వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి కిడ్నాప్ చేసిన 10 నెలల పాప
- కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి కిడ్నాప్ చేసిన మూడు సంవత్సరాల బాలుడు
- మంచిర్యాల, రామగుండం ప్రాంతాల్లో కిడ్నాప్ చేసిన ఇతర చిన్నారులను

సురక్షతంగా రెస్క్యూ చేయడం జరిగింది. అక్రమంగా పిల్లలను కొనుగోలు చేసిన దంపతులను కూడా అదుపులోకి తీసుకున్నారు.

ఈ కీలక కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్ ఫోర్స్, కాజీపేట పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించి, రివార్డులు అందజేశారు.

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పోటీ..?

మొదటిపేజీ తరువాయి..

జనసేన పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని తెలంగాణ జనసేన విభాగం నిర్ణయించింది. రాష్ట్రంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన నిర్ణయించింది. ఈ మేరకు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ పేరుతో ప్రకటన విడుదలైంది.

తెలంగాణలో పార్టీని బలోపేతం చేసే దిశగా, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనే లక్ష్యంతో పార్టీ ఇప్పటికే కార్యాచరణను ప్రారంభించిందని ఆ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు నెల రోజుల కంటే తక్కువ సమయం ఉన్నప్పటికీ, సాధ్యమైనన్ని స్థానాలలో పోటీ చేయనున్నట్లు వెల్లడించారు.

పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లడం, పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ భావజాలాన్ని, ఆయన ఆశయాలను, తెలంగాణ ప్రాంతం పట్ల ఆయనకున్న అనుబంధాన్ని ప్రజలకు చేరవేయడం, తద్వారా తెలంగాణలో సరికొత్త రాజకీయ వేదికకు బలమైన పునాది వేయడమే లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిబద్ధతతో పని చేస్తున్న జనసైనికులు, వీరమహిళలు చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయొద్దు

## - కాంగ్రెస్ డిమాండ్

హనుమకొండ, జనవరి 10 (తొలి వెలుగు) : హనుమకొండ డీసీసీ భవన్‌లో శనివారం ఎఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచే విధంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలకు వ్యతిరేకంగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్. నాగరాజు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమాన్ని శాంతి, అహింస మార్గంలో ముందుకు నడిపిన జాతిపిత మహాత్మా గాంధీ పేరు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అలాంటి మహానేత పేరును జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి తొలగించడం ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది పేద కుటుంబాలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జీవనాధారంగా మారిందన్నారు. పేదలకు ఉపాధి, ఆదాయం కల్పిస్తున్న ఈ పథకాన్ని నిధులు తగ్గించడం, పనిదినాలను కుదించడం ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం క్రమంగా నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు.

'ఆప్ కీ బార్ చార్ సౌ పార్ల అంటూ ప్రచారం చేసిన బీజేపీ పార్టీ నేడు ఇతర పార్టీల నేతలపై ఆధారపడి ప్రభుత్వాన్ని కొనసాగించాల్సిన పరిస్థితికి



చేరిందని విమర్శించారు. గాంధీ--నెహ్రూ కుటుంబం, కాంగ్రెస్ పార్టీపై ఉన్న రాజకీయ ద్వేషంతోనే ప్రజలకు ఉపయోగపడే పథకాలపై దాడులు చేస్తోందన్నారు.

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించి, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, తగిన నిధులు కేటాయించి పనిదినాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గ్రామీణ పేదల పక్షన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడేందుకు గ్రామగ్రామాన ఉద్యమాలు చేపట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు, హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వర్ధన్నపేటలోనే 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి

## - మూడవ రోజు రిలే నిరాహార దీక్ష



వరంగల్ / వర్ధన్నపేట , జనవరి 10 (తొలి వెలుగు) : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం వర్ధన్నపేటలోనే చేపట్టాలి అనే డిమాండ్‌తో వర్ధన్నపేట సాధనా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడవ రోజు కొనసాగాయి. ఈ దీక్షలకు జ్యోతీబావు పూలే సంఘం సంపూర్ణ మద్దతు, సంఘీభావం ప్రకటించింది.

ఈ సందర్భంగా జ్యోతీబావు పూలే సంఘం నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రజా అవసరాలపై తీసుకున్న నిర్ణయాలను మార్చడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఓ నంబర్ 445 (జూన్ 2025) ప్రకారం, వర్ధన్నపేటలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలంలోనే 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి టెండర్ నోటీసు జారీ అయ్యిందని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితిలో, అదే టెండర్‌ను అమలు చేయకుండా ప్రజలను గందరగోళానికి గురి చేయడం తగదని అన్నారు.

ప్రభుత్వమే స్వయంగా 2025 జూన్ 11న టెండర్ నోటీసు జారీ చేసి, ఇప్పుడు దాని అమలుపై వెనక్కి తగ్గడం ప్రజల విశ్వాసానికి విఘాతం కలిగించడమేనని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలను గౌరవించి, పాత ఆసుపత్రి స్థలంలోనే 100 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఇదే సమయంలో, వర్ధన్నపేటలో ఆసుపత్రి నిర్మాణానికి స్థల సేకరణ పూర్తయిందంటూ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని వర్ధన్నపేట సాధనా సమితి తీవ్రంగా ఖండించింది. ఇది ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమని ఆరోపించింది. ప్రభుత్వ ఉత్తర్వులు, టెండర్ నోటీసుల ప్రకారమే పనులు జరగాలని స్పష్టం చేసింది.

ప్రభుత్వం వెంటనే స్పందించి, వర్ధన్నపేట ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని 100 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని వర్ధన్నపేటలోనే పూర్తి చేయకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సాధనా సమితి హెచ్చరించింది.

ఈ దీక్ష కార్యక్రమంలో వర్ధన్నపేట సాధనా సమితి నాయకులు, జ్యోతీబావు పూలే సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు తేల్చాకే ఎన్నికలు నిర్వహించాలి

## - బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలా వెంకటేష్





చౌటుప్పల్, జనవరి 10 (తొలివెలుగు) : మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే నోటిఫికేషన్ విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలా వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం చౌటుప్పల్ మండల కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం మాయమాటలు చెప్పిందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లోనైనా 42 శాతం కోటాను అమలు చేయకుంటే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిళ్ళ సతీష్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మార్గం శివకృష్ణ యాదవ్, ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బిక్షపతి, ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి లోగిళ్లలో 'సంక్రాంతి' సందడి

- కళాశాల చైర్మన్ బండారు మయూర్ రెడ్డి
- కళాశాల కరస్పాండెంట్ భీమిడి సుభాష్ రెడ్డి
- విశాలభారతి కరస్పాండెంట్ వీసం చైతన్య కాంతి వర్ధన్ రెడ్డి






చౌటుప్పల్, జనవరి 10 (తొలివెలుగు) : చౌటుప్పల్ పట్టణంలోని శ్రీ గాయత్రి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. శ్రీ గాయత్రి కళాశాల విద్యార్థులకు లక్కారంలోని వి.వి.ఆర్ ఫంక్షన్ హాల్‌లో రంగోలి పోటీలు నిర్వహించగా, విశాల భారతి హైస్కూల్‌లో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ భీమిడి సుభాష్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి మన సంస్కృతికి ప్రతీక అని, విద్యార్థులు చదువుతో పాటు సంప్రదాయాలను గౌరవించాలని కోరారు. కళాశాల చైర్మన్ బండారు మయూర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా జాతీయ స్థాయి పరీక్షలైన నీట్, జేఈఈల్లో రాణించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. విశాల భారతి హైస్కూల్‌లో హరిదాసు సంకీర్తనలు, భోగి మంటలతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వీసం చైతన్య కాంతి వర్ధన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కోడెల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గులతో మురిసిన 'ట్రినిటీ' ముంగిలి





- ట్రినిటీ విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు
- గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల చైర్మన్ వెన్ రెడ్డి సంధ్య రాజు
- ట్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల



చౌటుప్పల్, జనవరి 10 (తొలివెలుగు) : తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి ముగ్గులు ప్రతీకలని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చౌటుప్పల్ మండల చైర్మన్ వెన్ రెడ్డి సంధ్య రాజు అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని ట్రినిటీ విద్యాసంస్థల్లో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నిర్వహించిన రంగోలి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఇళ్ల ముందు వేసే రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు సిరిసంపదలకు సూచికలని తెలిపారు. ప్రకృతికి కృతజ్ఞత తెలిపే ఈ పండుగ విశిష్టతను నేటి తరానికి అందించడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ కె.వి.బి. కృష్ణారావు, ట్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్ ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# షర్ఫుద్దీన్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

- కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణాధ్యక్షుడు మొగుదాల రమేష్ గౌడ్



చౌటుప్పల్, జనవరి 10 (తొలివెలుగు) : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డుకు చెందిన మహమ్మద్ షర్ఫుద్దీన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణాధ్యక్షుడు మొగుదాల రమేష్ గౌడ్ ఆర్థిక సాయం అందజేశారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రమేష్ గౌడ్, షర్ఫుద్దీన్ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని, అవసరమైన సమయంలో సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేసి, ఏ సమస్య వచ్చినా తమ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కాంగ్రెస్ నాయకులు, మత పెద్దలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# దివిస్ వద్ద లారీ బీభత్సం.. ఆటో పల్టీ!

- లింగోజిగూడెం వ్యక్తికి తీవ్ర గాయాలు
- వనస్థలిపురం ఆసుపత్రికి తరలింపు

చౌటుప్పల్, జనవరి 10 (తొలివెలుగు) : చౌటుప్పల్ పరిధిలోని దివిస్ కంపెనీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకారం.. లింగోజిగూడెం గ్రామానికి చెందిన పోలేపల్లి అంజయ్య (56) తన ఆటోలో వెళ్తూ దివిస్ కంపెనీ వద్ద యూటర్న్ తీసుకుంటున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు అతివేగంగా వెళ్తున్న లారీ ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ధాటికి ఆటో పల్టీలు కొట్టి ముందున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంజయ్య తల, కడుపు, కాళ్లు, చేతులకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆయనను చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు వనస్థలిపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కారులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. బాధితుడి బంధువు ధనరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

# కర్నె ప్రభాకర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు

- అల్లాపురం గ్రామ 8వ వార్డు సభ్యులు భూతం లింగస్వామి యాదవ్



చౌటుప్పల్, జనవరి 10 (తొలివెలుగు) : బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ని చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామానికి చెందిన పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామ 8వ వార్డు సభ్యులు భూతం లింగస్వామి యాదవ్ కర్నె ప్రభాకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులు, అల్లాపురం గ్రామ అభివృద్ధిపై చర్చించారు. కార్యకర్తలకు, నాయకులకు కర్నె ప్రభాకర్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు బోయిని వెంకటేష్ యాదవ్, రుద్రాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నాగపురి కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



జనగాం జిల్లా / బచ్చన్నపేట, జనవరి 10 (తొలి వెలుగు) : జనగాం జిల్లా బచ్చన్నపేట మండలం తమ్మడపల్లి గ్రామానికి చెందిన అబ్బసాని దినేష్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ చెక్కును నాగపురి కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూకల బాల్ రెడ్డి గారు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల కష్టసుఖాల్లో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. అవసరంలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తమ్మడపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉప సర్పంచ్ గొల్లకొండ నాగరాజు, 8వ వార్డు సభ్యులు మేకల భవాని రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పత్తి ప్రభాకర్, మోత్కూరి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డు గ్రహీత ఐత మల్లేష్‌కు ఘన సన్మానం

- దళితుల అభ్యున్నతే లక్ష్యంగా నిరంతర కృషి అవసరం : ఎస్ఐ పస్తం శ్రీనివాస్



హన్మకొండ / ఐనవోలు, జనవరి 10 (తొలి వెలుగు) : హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో దళిత రత్న అవార్డు గ్రహీత ఐత మల్లేష్‌కు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐనవోలు జాతర ఏర్పాట్లను పకడ్బందీగా పర్యవేక్షిస్తున్న స్థానిక ఎస్ఐ పస్తం శ్రీనివాస్‌ను ఐత మల్లేష్ మర్యాదపూర్వకంగా కలసి రాజ్యాంగ గ్రంథాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పస్తం శ్రీనివాస్ మాట్లాడుతూ, దళితుల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఐత మల్లేష్ సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. అనగారిన వర్గాల సంక్షేమం, వారి సామాజిక-ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా నిరంతరం పని చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇటువంటి సేవా భావన సమాజానికి ఆదర్శమని అన్నారు. అనంతరం ఐత మల్లేష్‌ను షాలువాతో ఘనంగా సత్కరించి, ఐనవోలు శ్రీ మల్లిఖార్జున స్వామి ప్రసాదాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబిటస్ పాఠశాలలో ఘనంగా 'ఓపెన్ హౌస్'

- కన్నవారి సేవలో.. అంబిటస్ చిన్నారులు!
- అమ్మనాన్నలకు పాదపూజ.. అంబిటస్‌లో భక్తి పారవశ్యం
- తల్లిదండ్రులే తొలి దైవాలు: రమేష్ గురూజీ





చౌటుప్పల్, జనవరి 10 (తొలివెలుగు) : తల్లిదండ్రులను గౌరవించి, వారిని సేవించుకున్నప్పుడే విద్యార్థులకు నిజమైన సంస్కారం లభిస్తుందని ఆధ్యాత్మికవేత్త ఆచార్య శ్రీ రమేష్ గురూజీ పేర్కొన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ, వలిగొండ రోడ్డులోని అంబిటస్ పాఠశాలలో శనివారం 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రమేష్ గురూజీ మాట్లాడుతూ.. నేటి సమాజంలో ధ్యానం, మౌనం ప్రాముఖ్యతను వివరించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యత సంతానంపై ఉందన్నారు. పాఠశాల చైర్మన్ కుంచారం జైపాల్ రెడ్డి, డైరెక్టర్ పిసాటి శ్రీకాంత్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. అంబిక, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పల్లెబాట.. వాహనాల జాతర







- కిక్కిరిసిన విజయవాడ జాతీయ రహదారి
- చౌటుప్పల్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్
- గంటల తరబడి నిలిచిపోయిన ప్రయాణికులు



చౌటుప్పల్, జనవరి 10 (తొలివెలుగు) : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరవాసులు సొంతూళ్లకు పయనమవడంతో హైదరాబాద్-విజయవాడ (65వ నంబరు) జాతీయ రహదారిపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో శుక్రవారం రాత్రి నుంచే ప్రయాణాల జోరు పెరిగింది. శనివారం (జనవరి 10) రెండో రోజు వాహనాలు వరదలా పోటెత్తడంతో చౌటుప్పల్ వద్ద ట్రాఫిక్ స్తంభించింది. పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరడంతో, అధికారులు విజయవాడ వైపు వెళ్లేందుకు మొత్తం 16 గేట్లలో 10 గేట్లను తెరిచారు. సాధారణంగా గంటలోపు చేరుకోవాల్సిన గమ్యస్థానాలకు ప్రస్తుతం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చౌటుప్పల్ పట్టణంలో సర్వీస్ రోడ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉండటం, చిట్యాల వద్ద ఫ్లైఓవర్ పనులు జరుగుతుండటమే ఈ ట్రాఫిక్ రద్దీకి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

## తుమ్మలూరు రోడ్డు సమస్య పరిష్కారానికి రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన గ్రామ సర్పంచ్


గ్రామపంచాయితీ కార్యాలయము - తుమ్మలూరు
మం॥ మహేశ్వరం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
శ్రీమతి తుమ్మటి అండాలు
సర్పంచ్
సెల్:- 8106991451



రంగారెడ్డి జిల్లా / మహేశ్వరం నియోజకవర్గం, జనవరి 10 (తొలి వెలుగు) : మహేశ్వరం మండల కేంద్రం నుంచి తుమ్మలూరు గేట్ వరకు నిర్మిస్తున్న ప్రధాన రహదారి గ్రామానికి అత్యంత కీలకమైన మార్గంగా ఉంది. ఈ రోడ్డుపై రోజూ విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. అయితే రోడ్డు పనులు ప్రారంభమై మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో గ్రామ ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి ప్రమాదకర స్థితికి చేరిందని, వాహనాల రాకపోకల సమయంలో విపరీతమైన దుమ్ము వల్ల పిల్లలు, వృద్ధులు, మహిళలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని గ్రామ సర్పంచ్ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వర్షాకాలంలో ప్రమాదాలు పెరుగుతున్నాయని, వేసవిలో దుమ్ము సమస్య మరింత తీవ్రంగా మారుతోందని వివరించారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో నూతన గ్రామ సర్పంచ్ తుమ్మటి అండాలు కృష్ణ గారు తెలంగాణ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి గారిని కలిసి పూర్తి స్థాయిలో వినతి పత్రం సమర్పించారు. ప్రజల భద్రత, గ్రామ అభివృద్ధి దృష్ట్యా పెండింగ్ రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేయాలని కోరారు. గ్రామ ప్రజల సమస్యను అర్థం చేసుకున్న చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి గారు సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో మాట్లాడి సంక్రాంతి పండగ అనంతరం రోడ్డు పనులను తిరిగి ప్రారంభించి వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన తక్కువ కాలంలోనే కీలకమైన మౌలిక వసతుల సమస్యలపై దృష్టి సారించి, నిరంతరం అధికారులను సంప్రదిస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్న తుమ్మటి అండాలు కృష్ణ గారి చొరవను గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామ యువకులు పాల్గొన్నారు.